


# సరివిందా — డి. కామేశ్వరి

'సుజా!...కాస్త కాఫీ యిస్తావా?' గదిలోకి వస్తూనే అడిగాడు సుధాకర్. 'ఏం పాపం పేకాట ఆడి అలసిపోయారా?' మంచంమీద అటు తిరిగి పడుక్కునే కాస్త కఠినంగా అంది సుజాత.

'ఊ...నిజంగానే అలసిపోయాను!... విసుగ్గావుంది...కాస్త వేడికాఫీ పడితే ఫ్రెష్‌గా వుంటుంది!...' మొహం తువ్వాలుతో తుడుచుకుంటూ, సుజాత ప్రక్కన కూర్చున్నాడు. 'ఏదేం...యిప్పుడు పడుకున్నావు!...'

'ఊ...థేంక్స్!...అదెంతకాదు!... పెళ్ళాం అనేది ఒకర్తి వుందని గుర్తుందే మీకు!' హేళనగా అంది సుజాత.

'అయ్యో! రాణిగారిని మరచిపోగలనా!... మరచిపోదామన్నా నీ వూరుకుంటావా?' భార్య కోపం గ్రహించకుండానే మామూలుగా నవ్వుతూ అన్నాడు సుధాకర్. 'అది సరే గాని...కాఫీ యిచ్చేదేమన్నావుందా, లేదా...?'

'ఏం, అంత తొందరపడుతున్నారు!... మళ్ళీ పేకాట ఆడాలా?'

'ఓ...అదా!...పేకాట ఆడావా యీ అలకంతా!'...భార్య కోపం గ్రహించి చిన్నగా నవ్వాడు సుధాకర్. 'నీకు సమంగారాదు... ఆడమంటే ఆడవు, నేను కాసేపు ఆడుకుంటే...దానికి కోపమే!'...

'నాకేం కోపం... వుంటే మాత్రం మీకు లెక్క ఏమిటి?...వెళ్ళండి పేకాటేం ఖర్మ, నాటకాలు, నాట్యాలు కూడ ఆడుకోండి!'...

'ఏమిటి సుజా యిది, కాసేపు పేకాడానని యింత కోపమా?...పోనీలే యింక ఆడను...యిక్కడే కూర్చుంటాను... కాఫీ తీసుకురా.' సుజాత భుజంమీద చెయ్యివేసి మృదువుగా అన్నాడు.

'కాఫీ మీకు నేనియ్యాలా ఏమిటి?...మా వదినగారిని అడగండి, అన్ని సపర్యలు చేస్తుంది కదా ఆవిడ మీకు,... ఆవిడే యిస్తుంది,...అడగండి!' మొఖం ముడుచుకుని అంది సుజాత.

సుధాకర్ అర్థం కాక తెల్లబోయి చూశాడు.

'ఏం ఎందుకంత ఆశ్చర్యం? అర్థం కానట్టు..మీరడుగుతారు, ఆవిడ యిస్తుంది.. పుచ్చుకుంటారు, అన్నీ వేళ, వేళలకే అమర్చడానికి ఆవిడ వుండగా...యింక పెళ్ళాం ఎందుకు?!...అన్నీ అందించడానికి. ఆటలు ఆడడానికి, కబుర్లు చెప్పడానికి అన్నింటికి ఆవిడ వుండగా యింక మీకు పెళ్ళాం ఎందుకు?' హేళన, నిరసన,...అసూయ, కోపం అన్ని మిళాయించి అంది సుజాత.

'సుజా!......ఏమిటంటున్నావు?...... ఏం మాట్లాడుతున్నావు?' ఆశ్చర్యంగా అడిగాడు అప్పటికీ అర్థంకాక సుధాకర్.

'నేనేం సంస్కృతం మాట్లాడడం లేదు! వెళ్ళి మావదినని కాఫీఅడగండి, యిస్తుంది... ...అంటున్నాను...'సాగదీస్తూ అంది సుజాత.

'సుజా,...ఏమిటిలా మాట్లాడుతున్నావు? ఏమిటేది? మధ్యన నీ వదిన ఏం చేసింది? యీ విసుర్లేమిటి? యీ అనవసర కోపమేమిటి?' కాస్త కోపంగా చూస్తూ అడిగాడు సుధాకర్.

'అవును నాకోపం అనవసరంగానే కనిపిస్తుంది.మీరిద్దరు చేసేపనులు బాగున్నాయి... ఆవిడ మీతో సరసాలాడ్డం, పేకాటలు, నవ్వులు నాటకాలు అన్నీ బాగున్నాయి. పరాయి మగవాడితో యిష్టం వచ్చినట్లు

ఆవిడ ప్రవర్తించడం బాగుంది, పెళ్ళాం వున్నదన్న సంగతి మీకు గుర్తులేక పోవడం బాగానే వుంది...'

'సుజా!' తీక్షణంగా చూశాడు సుధాకర్.

'ఏమిటీ అసందర్భపు మాటలు...మతి గాని పోయిందా నీకు, నీవేం మాట్లాడు తున్నావో తెలుసా!... నే నావిడతో సరసాలాడానా?...ఆవిడనాతో నాటకాలు ఆడుతూందా?...ఎవరి గురించి మాట్లాడు తున్నావో తెలుసా!...' కోపంతో మాటలు తడబడ్డాయి సుధాకర్‌కి.

'ఏం, కోపం యెందుకు వున్నమాట అంటే...'

'ఏమిటా వున్నమాట? ఆమె నాకు కాఫీ ఫలహారాలు అందించడం తప్పా, యింట్లో ఆవిడ అన్నీ చూస్తూంది కనుక ఆవిడని నేనేదన్నా కావాలిస్తే అడగడం తప్పా, అందరితో కలిసి సరదాగా పేకాట ఆడ్డం తప్పా?. .యిందులో నీవు తప్పు పట్టవలసింది ఏం వుంది?...ఎందుకు తిం కూర్చుని యిలా అనుమానాలు, అపోహాలు పడి..'

'లవ్వే...తప్పేంలేదు, దేన్లోనూ తప్పు లేదు.' ఆ హేళనకి, నిర్లక్ష్యానికి సుధాకర్ వళ్ళు మండింది.

'నీ వెక్కిరింతలు. హేళనలు మాని,... సూటిగా చెప్పదల్చింది చెప్పు, ఏ విషయం గురించి నీ విలా అనుమానపడి మాట్లాడు తున్నావు?...మా ప్రవర్తనలో నీకు ఏం తప్పు కనిపించింది?. .' తీక్షణంగా అడిగాడు.

'తప్పేముంది! ..యిష్టం అయితే ఏ తప్పు వుండదు!. .'

సుధాకర్ ఒక్క క్షణం నిశితంగా సుజాత మొహంలోకి చూశాడు. సుజాత వ్యర్థ అనుమానం, అపార్థానికి కాస్త ఏహ్యమే కలిగింది భార్యమీద

'ఛా...పరాయి యింటినించి వచ్చిన అమ్మాయిని కాదన్నా, యింత తేలిగ్గా... యింత నిందవేయగలిగావు...యిదే నీ అక్క చెల్లెళ్ళయితే వేయగలవా?...అన్న భార్య, వదినగారిని...నీవు అనవలసిన మాటలేనా యివి?'...

సుజాత కలవరపడింది ఒక్క క్షణం... క్రిందిపెదవి పంటక్రింద నొక్కిపట్టి విసురుగా... 'ఎవరైనా నాకు ఒకటే... నా మొగుడిని వలలో వేసుకోడానికి ప్రయత్నిస్తుంటే చూస్తూ వూరుకోవడం నాకు చాతగాదు' బింకంగా అంది.

'ఛఛ్... నోటికి వచ్చినట్టు మాట్లాడకు!... యింతోటి మొగుడు నీకే కాదు, ఆవిడకీ వున్నాడు నీ మొగుడిపాటి మొగుడు... ఆవిడకేం ఖర్మ కాలింది నీ మొగుడిని వలలో వేసుకోడానికి?'...

'ఏమో, ఏం అవసరం వచ్చిందో నాకేం తెలుసు, ఏం లేకపోతే ఎందుకలా మిమ్మల్ని పూసుకు తిరగడం...మీకన్నీ అంత అభిమానంగా, ఆప్యాయంగా అమర్చడం...'

'సుజాతా!' కోపంగా అరిచాడు సుధాకర్. 'ఛీ...నీకు బుద్ధిలేదు...యింత చిన్న విషయానికి యిలా అనుమానపడి....మీ వదిననీ,...తోటి స్త్రీని గురించి యింత హీనంగా ఆలోచిస్తావా?...పాపం ఆవిడ యింటి కోడలుగా...యింటికి వచ్చిన అతిథికి...అందులో అల్లుడికి కాఫీ ఫలహారాలు అమర్చడం తప్పా?.. నలుగురిలో కలసి సరదాగా మాట్లాడడం, కాసేపు ఆడడం తప్పయిందా?...అసలు నీ కిలాంటి అనుమానం ఎలా వచ్చింది?'...

'ఏం ఎందుకు రాదు?. .ఆవిడ ఎందుకు మీకు అన్నీ చూడ్డం? నేనేమయ్యాను!.. భార్యని నేనుండగా,...నా మొగుడి విషయం దానికెందుకు? ఆవిడ మొగుడు సంగతి నేనేమైనా చూస్తున్నానా?. . నా మొగుడి విషయంలో తన కెందుకంత శ్రద్ధ!'... కోపంగా అంది సుజాత.

మితిమీరిన అసహ్యంతో, తిరస్కారంగా చూశాడు సుధాకర్.

'అసలు నీ కిలాంటి ఊహలు వచ్చినందుకు సిగ్గుపడాలి నువ్వు సుజాతా! ఆవిడ మొగుడికి నీవు అన్నీ అమర్చడానికి, నీ మొగుడికి ఆవిడ అన్నీ అందించడానికి చాలా తేడా వుంది! ఆవిడ మొగుడు నీకు అన్న!...యిది నీపుట్టిల్లు!...యిక్కడ నీవు ఎవరికి ఏం చేసినా, మానినా ఎవరూ అను కోరు!...కాని ఆవిడ ఆ యింటికోడలు! యింటికొచ్చిన వాళ్ళ మంచి చెడ్డలు చూడాల్సిన బాధ్యత ఆవిడ కుంది! ఆవిడ తన బాధ్యత నెరవేరుస్తే... యిలా అంటున్నావు ...నీమీ పట్టించుకోకుండా వుంటే ఆ నోటితోనే 'పుట్టింటికి వస్తే యిన్ని కాఫీ నీళ్ళయినా యిచ్చే దిక్కులేదు. మా అమ్మేవుంటే యిలాగే చేసేదా?' అని నీవే నిష్ఠూర్యమాడుతావు!. .ఛీ...నావివరుసలు కూడ మరచిపోయి...ఎందు కిలాంటి అనుమానాలు...ఆమె నాకు సోదరి వరుస తెలుసా!'...బాధగా అన్నాడు సుధాకర్!

'సోదరి!'...వెక్కిరింపుగా అంది సుజాత... 'పాపం ఎంత అభిమానం లేకపోతే .. సోదరిని యిలా వెనకేసుకు వస్తారు!'...

తీక్షణంగా చూశాడు సుధాకర్. 'చదువు కున్న దానివి,...యింత సంస్కార హీనంగా ఎలా మాట్లాడుతున్నావు?... యీ పాటి వివేకంలేని నీకు ఆ డిగ్రీ ఎందుకు కాల్చనా?...'

సుజాత మొహం ఎర్రబడింది. 'డిగ్రీ లున్నంత మాత్రాన...నా మొగుడిని వలలో వేసుకోడానికి ప్రయత్నించే వారిని క్షమించే ఔదార్యం నాకులేదు...సంస్కారం అంటే అదేనని నాకు తెలీదు!' కర్కశంగా అంది.

సుజాత వ్యర్థ అనుమానానికి, మూర్ఖత్వానికి సుధాకర్‌కి పట్టరాని కోపం వచ్చింది. అలాంటి మనిషితో ఏమని వాదించి వప్పించాలో కూడ అంతుబట్టలేదు.

'సుజా!...చెప్పినా కూడ...యింకా నీవు నీ అనుమానాలతో బాధపడాలని వుంటే సరే, ...ఇంకోసారి గట్టిగా చెపుతున్నాను...నీవు పాపపక్షి, అనుమానపడవలసిన బాంధవ్యం మా మధ్యలేదు...ఆమె నాకు చెల్లెలితో సమానం...యింతే నేను చెప్పదలచింది!'... భార్యతో యింక మాటలు పెంచడానికి మనస్కరించక చేతికందిన పుస్తకం తీసి మొహానికి అడ్డు పెట్టుకున్నాడు.

తనని ప్రతిమాలి, ప్రాధేయపడుతాడను కున్న సుధాకర్ అంత నిర్లక్ష్యంగా అంటీ అంటనట్లు ప్రవర్తించడంతో సుజాత ఉక్రోషం...కన్నీళ్ళుగా మారింది.

'పెళ్ళయి...యింకా మూడునెలలయింది... అప్పుడే నామీద మీకు యింత విముఖత్వం కలిగిందంటే...అది కాదూ కారణం ..అంత యిష్టంలేకపోతే...ఎందుకు పెళ్ళిచేసు కోవాలి ఎన్నో సంస్కారవంతుల్ని, యిష్టమయినవారినే కట్టుకుని వుండాల్సింది...' సుజాత మాటలు బాణాల్లా దూసుకున్నా... తనని కాదన్నట్లు చలనం లేకుండా అలాగే కూర్చున్నాడు సుధాకర్.

'ఛీ...ఛీ...అసలు యిలాంటి ఆలోచన ఎలా వచ్చింది సుజాతకి! చదువు, సంస్కారం అన్నీవున్నాయనుకున్న తన భార్య

ఊహలు యింత హీనంగా వున్నాయా?... పరాయి ఆడదాని వంక కన్నెత్తిచూస్తేనే అనుమానపడేంత నీచ మనస్తత్వమా?... ఎవరో చదువురాని మూర్ఖులు,...పంపుల దగ్గర ఆడవాళ్ల మనస్తత్వమా?... సుజాతది! యింత కుసంస్కారమా?

ఇంతకీ తామేం అసభ్యంగా ప్రవర్తించామని యిలా అపోహలు పడుతూంది! తను మాటల్లో, చేతల్లో ఎంచి చూపడానికైనా ఏం తప్పు కనిపించింది సుజాతకి! ఆవిడ తన గదిలో దూరి ఏకాంతంగా రహస్యాలు మాట్లాడిందా? తాను ఆవిడతో ఏం గుసగుసలాడాడు? ఏం తప్పు కనిపించింది?... యింటికివచ్చిన చుట్టానికి కాఫీ, ఫలహారాలు యిస్తే అందులో అనుమానపడే దేముంది? ఏమన్నా సరదాగా మాట్లాడుకున్నా, సరదాకి పేకాట ఆడినా అందరూ కలసి, నలుగురిమధ్యన హాలులో కూర్చుని ఆడారు! యిద్దరూ వంటరిగా ఎన్నడూ ఏం చెయ్యలేదు! అలాంటప్పుడు యింత నింద ఎలా వేయగలిగింది సుజాత!

ఆవిడమీద అనవసరంగా యిలా ఎందుకు కత్తి పట్టింది! తనసంటే తను యింత బాధపడకపోను! అన్న భార్యని, వదినని పెళ్లయి కాపురం చేసుకుంటూ, పిల్లల తల్లిఅయిన ఆమెనిగురించి యింత హీనంగా ఆలోచిస్తున్నందుకు ... సుధాకర్ వళ్లు కోపంతో దహించుకు పోసాగింది. పైగా తను ఏదో కొట్టినట్లు యింత చిన్న విషయానికి కొంప మునిగినట్లు ఏడుస్తున్న సుజాతని చూస్తే జాలి బదులు మరింత కోపం పెరిగింది.

'మావయ్యగారూ,... యిదిగో కాఫీ... అమ్మ యియ్యమంది' ఏడేళ్ల సరోజ వచ్చి గ్లాసు అందించింది...' యింత అభిమానంగా, ఆదరంగా వేళ వేళకి యింట్లో అందరి అవసరాలు గుర్తించి అభిమానంగా చూసే కమలని ఎంత మాట అంది!

కమలతో తను చనువుగా మాట్లాడే మాట నిజమే!...ముందునించి వున్న పరిచయంవల్ల కమలతోటి కాస్త సన్నిహితంగానే వుంటాడు...

కమలని తనకు యీ పెళ్లికాకముందే తెలుసు! తన ఫ్రెండు భాస్కర్ చెల్లెలు కమల! యూనివర్సిటీలో తన చదువు, భాస్కర్ చదువు వేరయినా భాస్కర్

# గురివింద

తనకి సీనియర్ అయినా భాస్కర్‌తో తనకు పరిచయం అయి...ఆ పరిచయం సన్నిహిత స్నేహంగా మారింది. భాస్కర్‌కోసం యింటికి వెళ్లే తనకి ఆ కుటుంబం అందరితోనూ పరిచయం వుంది. పండుగలు, శుభకార్యాలు వచ్చినా భాస్కర్ యింటికి భోజనానికి వెళ్తూండేవాడు. ఒక సారి తనకి తీవ్రమయిన జ్వరంవస్తే భాస్కర్ యింటికి తీసికెళ్లి ఆ పదిహేను రోజులు ఎంతో అభిమానంతో పరిచర్యలు చేశాడు.

భాస్కర్ చెల్లెలు కమలకి అప్పటికే పెళ్లయింది. అప్పుడు పురిటికి పుట్టింటికి వచ్చివుంది. తనకన్నా ఒక సంవత్సరమే చిన్న కమల. తన భారం అంతా చెల్లెలికి అప్పగించాడు. జ్వరంలో వున్నన్ని రోజులు, కమల తనకి స్వంత అన్నయ్యకి చేసినంత అభిమానంగానూ పరిచర్యలు చేసింది...'సుధాకర్‌గారూ' అంటూ ఎంతో చనువుగా మెలగింది. అప్పటినించి ఆ యింటిలో అందరితో తనకి గాఢ మైత్రి కలిగింది. చదువులు అయి ఉద్యోగాలలో వున్నా భాస్కర్ తనూ యిప్పటికీ మిత్రులే! అసలు యీ సంబంధం కమల ద్వారానే కుదిరింది. సుజాత లాంటి అందచందాలున్న భార్య లభించినందుకు... కమల పట్ల కృతజ్ఞత తన మనసులో యిప్పటికి వుంది!

ముందునించి వున్న పరిచయం కొద్దీ, చనువు కొద్దీ, అత్తవారింట్లో అందరూ క్రొత్త చేత,...ఏం కావల్సినా ఎవరినయినా అడగడానికి బిడియపడేవాడు. అందరిలో సుజాతతో మాట్లాడడానికి మొహమాటపడి ఏదైనా కావలిస్తే కమలని అడిగేవాడు. కమలకూడ ముందునించీ వున్న చనువుచేత అన్నీ అమర్చిపెట్టి, సరదాగా మాట్లాడింది...అంతకు తప్ప యిద్దరికీ ఏ కోశానా ఏ దురుద్దేశమూలేదు.

అసలు కమకేలం ఖర్మం! ఆ మొగుడికంటె తను ఎందులో అధిక్యుడు!?... అలాగే సుజాత కంటె కమల ఎందులోనూ ఎక్కువకాదు! సుజాత అందచందాలతో అసలు కమల పోటీపడలేదు! అలాంటప్పుడు ఏం చూసి యిద్దరూ వున్న భార్యని, భర్తని వదిలి యింకోరి వెంటపడే ఖర్మ ఏమిటి తమకు?...యింత మాత్రం యోచించలేని మూర్ఖురాలా సుజాత!

సుజాత ఎంత అందంగా వుంటుంది! వికసించిన గులాబిలాంటి అందం వెనక కంటకం లాంటి యింత సంకుచిత మనస్తత్వమా!

సుజాత లాంటి భార్య దొరికినందుకు యీ క్షణం వరకు ఎంత గర్వించాడు! యింత అందగత్తెను వుంచుకుని పరస్త్రీ వ్యామోహంలో పడతాడని ఎలా అనుకుంది? ఎంత అపురూపంగా, అభిమానంగా చూస్తున్నాడు సుజాతని తను...తన ప్రేమని కూడ గుర్తించలేక పోయిందా?

అసలు సుజాత కోపం, అనుమానం తన మీద కాదు! కమలమీద అని గ్రహించాడు సుధాకర్....అసూయ! తన భర్తని ఆకర్షిస్తుందన్న అపోహ! స్త్రీలో ఓపాలు ఎక్కువే అసూయ వుంటుందని తనకూ తెలుసు!... కాని యింత అసూయా? ఆ అసూయకైనా అర్థముండాలి! కన్నెత్తిచూస్తే, పన్నెత్తి మాట్లాడినంత మాత్రాన అనుమానమా? భార్య భర్తలకి ఒకరిమీద ఒకరికి యీ మాత్రం విశ్వాసం లేకపోతే ఎలా?

తన భర్త తన కళ్లెదుట, తన కనుసన్నల్లో వుండి, తనమాట జవదాటకూడదని...తనమీదే పూర్తిగా ఆధారపడి వుండాలని,...ప్రతీ భార్యా వాంఛించడం సహజమే! తనకు మాత్రం సుజాత సాన్నిధ్యంలో గడపడం యిష్టంలేదూ!

'అయితే నలుగురిలోనూ వున్నప్పుడు ఎంత క్రొత్తపెళ్లాం అయితే మాత్రం ఇరవైనాలుగు గంటలు గదిలో తలుపులు బిడాయించి కూర్చుంటే ఏం అనుకుంటారు! తమ యింట్లో తామిద్దరూ తమ యిష్టం వచ్చినట్లు వుంటారు... ఒక్క నాలుగైదు రోజులు కాస్త ఓర్పు వహిస్తే పోయేదానికి...అంత మాత్రం సహనం కూడ చూపలేక పోయింది సుజాత!

'ఏం బావగారూ, ... గదిలో దూరి పోయారు!...రండి, యింకో రౌండువేద్దాం!' బావమరిది పిలుస్తూ వచ్చాడు. వాడిన మొఖాన్ని ప్రసన్నంగా మార్చుకుంటూ... 'ప్లీజ్, ఏం అనుకోకండి...యివాళ యింక ఆడలేనండీ!...ఎమిటో కొంచెం తలనొప్పిగా వుంది...కాస్త స్నానం బదీ చెయ్యాలి,...

మీరందరూ ఆడుకోండి. తప్పించుకుంటూ అన్నాడు సుధాకర్, యిప్పుడు మళ్ళీ ఆడుతే యింకెంత రాద్ధాంతం చేస్తుందో సుజాత! అనిపించి భయపడ్డాడు సుధాకర్. తనకు పేకాట చాలయిష్టం. ఉత్తిరోజుల్లో ఆఫీసు, పని తీరు బాటే వుండదు! ఏదో యిలా నలుగురూ కలిసినప్పుడే గదా ఏం ఆడినా! సరదాగా నలుగురిలో ఆడుకున్నందుకు ఎంత గొడవ! ఎంత క్రొత్త భార్య అయినా,... ఆ భార్య ఎంత అందగత్తె అయినా...యిరవై నాలుగు గంటలు ఆమెతోటే లోకంగా...ఏ మగవాడు...ఎన్నాళ్ళు గడపగలడు? అంత కట్టి బంధించాలనుకునే భార్య మనస్తత్వాన్ని మగవాడు సహించగలడా?'

'ఏమండీ, సుధాకర్‌గారూ...తలనొప్పిగా వుందన్నారుట...మాత్ర ఏమన్నా యిూయ మన్నారా?...మీ దగ్గర ఏమన్నా వున్నయ్యా?' ఆదరంగా గది గుమ్మంలో నిల్చుని, నిష్కల్మషంగా అడుగుతున్న కమలనిచూసి తడబడ్డాడు సుధాకర్.

'అబ్బే...ఫరవాలేదండీ... కొంచెం తలనొప్పే! మాత్రవేసుకున్నాను లెండి...'అదో రకంగా గాబరాపడుతూ అన్నాడు...ప్రతిసారి లాగ నిస్సంకోచంగా మాట్లాడలేకపోయాడు సుధాకర్....


'వేసుకున్నారా!...అదేం సుజా!...పడుకున్నావు యిప్పుడు?' సుజాత పలకక పోవడంతో 'సుజాత పడుకుందేం సాయంత్రం?' సుధాకర్ వంక తిరిగి అడిగింది...' 'పడుకుంది...నిద్రపోతూంది లెండి'...ఏడుస్తున్న సుజాత కమల కంటబడడం యిష్టం లేక ఏదో సర్దిచెప్పేడు. అసలు కమల అక్కడ నించి ఎంత త్వరగా వెళ్ళిపోతుందా అనిపించింది సుధాకర్‌కి...అసలే మండిపోతున్న సుజాత యింకా తామిద్దరూ యిలా మాట్లాడుకోవడం, ఆజ్యంపోసినట్లవుతుంది! వెళ్ళిపోతున్న కమలని,...కళ్ళుతెరచి తీక్షణంగా, తడికళ్ళతో చూస్తున్న సుజాతని చూడగానే సుధాకర్ మనసు మూలిగింది బాధగా.

ఎందుకింతలా ఆనిడమీద కక్షకట్టింది? తక్కిన అందరూ సుజాత అక్కచెల్లెళ్ళు... యింకో వదినగారూ...అందరూ మామూలుగా తనతో మాట్లాడుతారే! వారందరి మీద లేని అనుమానం ఒక్క కమల మీదే ఎందుకు? అసలు వచ్చిన రెండుమూడు రోజుల్నించి...అప్పుడు తను కనిపెట్ట లేక పోయాడు గాని...రెండు మూడు సందర్భాలలో కమల పట్ల సుజాత ప్రవర్తన యిలాగే వుంది. నిన్న సాయంత్రం షికారు వెడ్దామని సుజాతని ముస్తాబవ మన్నాడు... యిూలోపల తను క్రింద వరండాలో, కమల కొడుక్కి ముస్తాబుచేస్తూంటే ప్రక్కన నుంచుని చంటివాడిని చిటికలు వేస్తూ పిలుస్తూ, వాడు నవ్వేబోసినవ్వులకి, కమల, తను నవ్వుతున్నారు...సుజాత ఎప్పుడు వచ్చి నుంచుందో ప్రక్కగది గుమ్మందగ్గర నుంచుని...మింగేసేట్టు చూస్తూంది... అప్పుడు ఆ కోపం తనుగ్రహించ లేక పోయాడు!...మొన్న అలాగే, అందరూ భోజనాలయ్యాక హాలులో కూర్చుని సరదాగ కబుర్లు చెప్పుకుంటున్నారు...కమల కూడ వచ్చి కూర్చున్న వెంటనే...అంత వరకు నవ్వుతూ కబుర్లు చెపుతున్న సుజాత మొహం మట మట లాడించుకుంటూ విసురుగా లేచివెళ్ళి పోయింది...యివాళా అంతే! బానమరిది వచ్చి పేకాట ఆడదామని పిలిస్తే వెళ్ళాడు...సుజాతని రమ్మని పిలిస్తే ముఖం ముడుచుకుని 'నేనురాను మీరాడుకోండి. మీరందరూ పేకాట ప్రవీణులు, నాకు రాదు' అంది. నిజమే సుజాతకి పెళ్ళి అయే వరకు పేకాటరాదు...తనకి సరదా నించి కొంచెం నేర్పాడు. 'పరవాలేదు, ఇంట్లో సరదాగా ఆడుకోడానికి చాలు పీ ఆట' అని బలవంత పెట్టినా రానని కోపంగా పడుకుంది. ఇష్టంలేదని తనింక బలవంత పెట్టలేదు, ఆ పేకాట ఆడాక యింత గొడవ చేసింది!

ఎలాగైనా యిక మీదట తను కాస్త జాగ్రత్తగా వుండాలి! తన మూలంగా కమల అనవసరమైన నిందకి గురి కాకూడదు! అనవసరమైన అపోహలకి, అనుమానాలకి తావీయకూడదు! కాని కమలకి ఎలా తెలుస్తుంది సుజాత అపోహ గురించి! ఏమని చెప్పడం కమలకి, సుజాత అనుమానం గురించి!?... తెలిస్తే ఎంత బాధపడుతుంది! ఆడబడుచు కోపాన్ని కమలంతటి కమల గ్రహించగలిగితే మంచిదే! కమలకి తెలియపోకయినా, భార్య మనస్తత్వం తెలిసిన తను కమలతో ముభావంగా వుంటే కొన్నాళ్లకి కమలే అర్ధం చేసి కొంటుంది! నిట్టూర్పు విడిచాడు సుధాకర్. సుజాత యింకా ఏడుస్తూనే వుంది!... ఒక్కసారి చూసి, పకరించడానికి మనస్కరించక, స్నానంచేసి, బయటికి వెళ్ళి మామగారి గదిలో భోజనాల టైము వరకు కూర్చుండి పోయాడు సుధాకర్.

రాత్రి భోజనాల దగ్గర ... అంతవరకు ఎంతో సరదాగా వున్న సుధాకర్ గంభీరతని... సుజాత ఏడ్పు మొహాన్ని చూసి అందరూ మొహాలు చూసుకుంటూంటే, సుధాకర్ ఎంతో సిగ్గుపడ్డాడు. మాటా మంతీ లేకుండా, విసురుగా, ధుమధుమలాడుతూ,

(58 వ పేజీ చూడండి)



భోజనం పూర్తిచేసి విసురుగా అందరిని కసిరిన సుజాత ప్రవర్తన చూసి తమ మధ్య ఏదో జరిగిందని అందరూ గుర్తిస్తారేమో నని సిగ్గుతో చితికిపోయాడు సుధాకర్. రాత్రి భోజనం చెయ్యకుండానే గదిలోకి వచ్చి ముసుగు బిగించి పడుకుంది సుజాత.

మొట్టమొదటిసారిగా... పండక్కి అత్తవారింటికి వచ్చాడు! ఎంతో ఆనందంగా, సరదాగా నలుగురిలో గడపవలసింది! ఏమిటిది?...ఎంతో చికాకనిపించింది సుధాకర్‌కి. అందరూ ఏమనుకుంటారు?... పెళ్ళయిన మూడునెలలకే తమ గురించి నలుగురూ నానా రకాలుగా అనుకోవడం తనకి యిష్టం లేదు. ఈ వున్న నాలుగు రోజులు ఎలాగో అలాగ సర్దుకుని గడపాలి మామూలుగా! యింటికి వెళ్ళాక యీ సమస్య ఎదురవదుగా యింక!

తెల్లవారితే పండుగ! సుజాత రేపూ యిలాగే ప్రవర్తిస్తే, పండుగపూటా కూతురు, అల్లుడు యిలా వుంటే యింట్లో వాళ్ళు బాధపడతారు? యింత అవివేకంగా ఆలోచించే మనిషికి తను యిప్పుడు ఏం చెప్పినా అర్ధమవదు! అసలు అర్ధం చేసికోవడానికే ప్రయత్నించని మనిషికి చెప్పి ప్రయోజనంలేదు! నెమ్మది మీద తనకే అర్ధం అవుతుంది తన అపోహ, ఉత్తి ఊహేనని!

'యిలా అనవసరంగా తామిద్దరూ కోపాలు పెంచుకుని, తమ మధ్య కలతలు పెంచుకోవడం వల్ల ఏం లాభం లేదు! జీవితాంతం ఒకటిగా గడపవలసిన తమలో యిప్పటి నించి భేదాభిప్రాయాలు రాకూడదు! యిలా మనశ్శాంతి లేకుండా బాధపడే కంటె సుజాతకి ఏదో చెప్పి ప్రసన్నురాలిని చేసుకోవాలి!

పెళ్ళయిన యీ మూడు నెలల్లో తామిద్దరిమధ్య అసలు చిన్న మాటపట్టింపు లైనా రాలేదు! యింతసేపు ... యిలా సుజాతతో మాట్లాడకుండా ఎన్నడూ లేదు!... యింకా పంతం పెంచుకుని కూర్చోలేక పోయాడు సుధాకర్. నెమ్మదిగా లేచి ప్రక్కన కూర్చుని సుజాతని తన వైపు తిప్పుకున్నాడు.

'యింకా కోపం పోలేదా సుజా!' ప్రేమగా అడిగిన సుధాకర్ మొహంలోకి చూడలేక కళ్ళు వాల్చుకుంది సుజా.

# గురివింద

(15 వ పేజీ తరువాయి)

'ఎందుకు చెప్పు అనవసరంగా యీ కోపం, యీ అనుమానం, ఏడుపు? నా మీద నీకా మాత్రం నమ్మకం లేదా? ... మూడు నెలలయింది, నేనెలాంటివాడనో అర్ధంచేసికోలేదా?'... రాజీ ధోరణిలో ఆరంభించాడు సుధాకర్.

'నాకు కోపంవస్తే మీకేం బాధ' యింకా బింకంగానే అంది సుజాత.

'నాకు కాకపోతే మరెవరికి బాధ! ఏదో నాలుగురోజులు సరదాగా వుందామని వచ్చాం...నీవిలా కోపాలు ఏడుపులు సాగిస్తే అందరూ ఏమనుకొంటారు? ... యీపాటి దానికి రావడమెందుకు యిక్కడికి?... నీ విలాగే వుంటే 'నేను రేపే వెళ్ళిపోతాను, అలా అయితే నీకు తృప్తి కలిగితే చెప్పు!'

సుజాత కొంత మెత్తబడింది. ఎర్రబడిన కళ్ళతో 'ఏం నాలోనే ఎంతసేపటికీ మీకు తప్పు కనిపిస్తోంది!... నేను మిమ్మల్ని ఏం అనలేదు, తను...ఆవిడ, మీ మీద ఎందుకు అంత ఇంటరెస్ట్ చూపాలి! భార్యాభర్తల మధ్యకి ఎందుకు రావాలి!...'

'సరే...సరే...మళ్ళీ ఎత్తకు ఆ గొడవ! నీ కంత అనుమానమయితే నేనసలు ఆవిడతో మాట్లాడనే మాట్లాడను!...అసలు ఆవిడ వున్నప్పుడు మీ యింటికే రాను... సరేనా!'

'నేను అలా...అన్నానా?' కలవరపాటుతో అడిగింది సుజాత.

'నీ వనక పోయినా నే నంటున్నాను!... యింక నిశ్చింతగా వుండు!' సుజాత మొహంలో భర్త యిచ్చిన భరోసాతో వెలుగు కనపడింది.

* * *

'సుజా!...మళ్ళీ యివాళ నాన్న దగ్గర నించి ఉత్తరం వచ్చింది. బాబుని చూడాలని నాన్న వూరికే కలవరిస్తూ రాస్తున్నారు. బాబు పుట్టి అప్పుడే పది నెలలయింది,...యింకా ఎప్పుడు తీసుకొస్తారని వారానికి ఒక ఉత్తరం రాస్తున్నారు... మనవడిని చూడాలని తాత, మామ్మవూరికే ముచ్చట పడుతున్నారు...నా కిప్పుడప్పుడే శలవదొరికేట్టు లేదు...నిన్ను, బాబు నయినా పంపమంటున్నారు...మీరిద్దరూ వెళ్ళి ఒక నెలవుండండి...నేను ఓ నాలుగు రోజులు శలవపెట్టి వచ్చి తీసుకు వస్తాను...యీ మనవడికోసం ఆ తాత గారూరికే కలవరిస్తున్నారు...' కొడుకుని ముద్దులాడుతూ, అన్నాడు సుధాకర్.

'మీరు లేకుండానా,...... ఒక్కతిని వెళ్ళనా!'...కొంత అయిష్టంగానే అంది సుజాత.

'పరవాలేదు...ఒక నెలేగా! ... అంతలా రాస్తున్నారు...వెళ్ళకపోతే బాగుండదు,... నిన్ను...బాబుని పంపిస్తున్నానని రాస్తాను నాన్నకి'...

* * *

'అదేంరా?...ఉత్తరం లేకుండా దిగావు... ఇంకా వారానికి వస్తానన్నావు?' రైలుదిగి వచ్చిన సుధాకర్‌ని చూస్తూ ఆశ్చర్య పోయింది తల్లి,

'లేదమ్మా, ముందు అనుకున్నానుగాని,... మళ్ళీ వారం మా జనరల్ మేనేజర్ వస్తున్నాడు, అప్పుడు శలవదొరకదు,...అందుకని యిప్పుడే శలవతీసుకున్నాను నాలుగు రోజులు...వెళ్ళేటప్పుడు సుజాని తీసుకు వెడతాను...ఏదీ ఎవరూ యింట్లో కనపడరేం?' నాలుగు వైపులా చూస్తూ అడిగాడు సుధాకర్.

'నాన్నగారు అలా షికారు వెళ్ళారు,... సుజాతని, పిల్లల్ని తీసుకుని మీ బావ సినిమాకి వెళ్ళారు'...

'బావ వాళ్ళు వచ్చారేమిటి?...'

'ఆ...వారం రోజులయింది, పద్మ, బావ వచ్చారు...అందరూ సరదాగా తిరుగుతున్నారు...నీవు కూడ లేవని ఎంతో యిదవుతున్నారు'...

'ఏం అన్నయ్యా...బాగున్నావా?'...... పద్మ లోపల్నించి వస్తూ అడిగింది.

'పద్మా!...నీ వింట్లోనే వున్నావా?...నీవు వెళ్ళలేదూ!...'కొంత ఆశ్చర్యంగా అడిగాడు.

'అందరం వెడదామనే అనుకున్నాం... తీరా సాయంత్రం అయ్యేసరికి నాకు కొంత జ్వరం తగిలినట్లుంది...టికట్లు కొన్నారని... సుజాత వాళ్ళని తీసుకుని మీబావ వెళ్ళారు!'

'ఊహూ' పాలోచనగా అన్నాడు సుధాకర్.

'లేవరా,...స్నానం అదీ చెయ్యి,... భోంచేద్దువుగాని'...లోపలికి వెడుతూ తల్లి అంది.

'అదేమిటి చెప్పి పెట్టకుండా వచ్చేశారు' సినిమానించి వస్తూనే సుధాకర్‌ని గదిలో చూసి ఆశ్చర్యంగా అడిగింది సుజాత

'తెలిస్తే ... జాగ్రత్తపడే దానివా?' అదోలా అడిగాడు సుధాకర్...'విహారాలు అయ్యాయా దేవిగారికి!'

'...విహారాలు ఏముంది...ఏదో సినిమాకి వెళ్ళాం...' బట్టలు మార్చుకుంటూ మామూలుగా అంది సుజాత.

'మా బావతోనా?' సుధాకర్ గొంతులోని వ్యంగ్యం సుజాత గుర్తించలేదు.

'ఊ...అందరం వెళ్దాం అనుకునే వేళకి, మీ చెల్లెలికి వంట్లో బాగులేదని రాలేదు, మేము వెళ్ళాం!...' అంతకంటె అప్పుడు యింక ఏం అనాలో తెలియక ఊరుకున్నాడు సుధాకర్.

* * *

'అయ్యాయా, అందరికి శుశ్రూషలు!... అయిందా మా బావగారికి పరిచర్య' పాపం నీకు సేవలతో ఊపిరి ఆడుతున్నట్టు లేదే?'

'బాగుంది శ్రమ అనుకుంటే ఎలా?... అత్తవారింట్లో ఆ మాత్రం చెయ్యకపోతే ఎలా? కూర్చుంటే అందరూ ఏమనుకుంటారు?' పమిట చెంగుతో చమట వత్తుకుంటూ ఆయాసపడుతూ అంది సుజాత.

'అ...ఆహా!...అలాగా?' వెక్కిరింపుగా అదోలా అన్నాడు సుధాకర్. అది గమనించకుండానే సుజాత జడవిప్పుకుంటూ...

'యింక అలాగే పడుకున్నారేమిటి? మూడు గంటలయి పోతూంది,...అందరూ తయారయి పోయారు...మనమే వుండిపోయాం!... లేవండి...!' తొందరపెడుతూ అంది సుజాత.

'ఎక్కడికి?' తాపీగా పడుకునే అడిగాడు సుధాకర్.

'బాగుంది...పొద్దున అందరం పిక్నిక్‌కి వెళ్దాం అనుకున్నాంగా...మరచి పోయారా?'

'నేనెందుకు?'

'అదేమిటి, మీరు రారూ?' వింతగా చూసింది సుజాత.

'నేనెందుకు మీ మధ్య?...నీవు, బావ అందరూ సరదాగా వెడుతూంటే మీ మధ్య నేనెందుకు?...' అదోలా అన్నాడు సుధాకర్.

'ఏమిటి?' తెల్లబోయింది సుజాత.

'అవును, వారంరోజుల నించి మీరు షికార్లకి, సినిమాలకి అన్నింటికీ వెడుతున్నారు యివాళ మీ మధ్య నేనెందుకు?'

# గురివింద

'ఏమిటి మాట్లాడుతున్నారు మీరు?' ఎర్రబడ్డ ముఖంతో సుజాత అడిగింది.

'తెలుగే మాట్లాడుతున్నాను!...వెళ్ళండి సరదాగా...వెళ్ళండి...నీకు మొగుడి అవసరం ఏమిటి? తీసికెళ్ళడానికి మా బావ వున్నాడుగా' కాస్త కఠినంగా అన్నాడు సుధాకర్.

'ఏమిటిది?...ఏమిటిలా కొత్తగా మాట్లాడుతున్నారు? ఏమిటి మీ ఉద్దేశం?'

'నా ఉద్దేశం ఏమిలేదు!...నేనురాను, నీవు వెళ్ళు!'

'మీరు రాకపోతే నేనెలా వెడతాను? నేనూ వెళ్ళను?'

'ఓహో!...ఏం పతిభక్తి?...ఏం నటన! యిన్నాళ్ళు తిరగ్గాలేనిది యివాళ ఏం వచ్చింది?' హేళనగా అన్నాడు సుధాకర్.

'నటనా?...నాది నటనా!...ఏమయింది మీ కివాళ, యిలా మాట్లాడుతున్నారు?'... కోపంగా అడిగింది సుజాత.

అవును నామాటలు బాగుండవు, నీ చేతలు బాగున్నాయా?'

'నేనేం చేశాను?...ఏమిటీ అర్థం పర్థం లేని మాటలు, చెప్పేది సరిగా అర్థం అయేట్టు చెప్పండి' తీక్షణంగా చూసింది సుజాత.

'కాస్త ఆలోచిస్తే అర్థం నీకే బోధపడుతుంది...మొగుడున్నాడని కూడా మరచిపోయి, పరాయి మగవాడితో సినిమాలు, షికార్లు...నేను లేనని యింత తిరితెగిస్తావా?' సూటిగా సుజాత మొహంలోకి చూస్తూ అడిగాడు సుధాకర్.

నివ్వెరపోయి చూసింది సుజాత... 'ఆ... ఎవరా పరాయి మగవాడు? నేనెవరితో తిరిగాను?... ఎవరి గురించి మీరిలా అంటున్నారు?' సుజాత గొంతు వణికింది.

'మా బావ!... మా బావ నీకు పరాయి మగవాడు కాక స్వంతమా?' సుజాత కోపం కట్టలు తెంచుకుంది. 'ఏమిటా మాటలు!... ఏం అంటున్నారో అసలు మీకు తెలుస్తూందా?...ఏదో సరదాగా నలుగురితో కలసి, మా బావగారితో సినిమాలకి, షికార్లకి వెళ్ళినంతమాత్రాన యిలా మాట్లాడుతున్నారా?...కాస్త కట్టుకున్న పెళ్ళాం యింకో మగవాడితో మాట్లాడినంతమాత్రాన యింత అనుమానమా?...యిదేనా మీ సంస్కారం. పెద్ద సంస్కారవంతులేమో!...యింతకీ నేను చేసిందాన్లో మీకేం తప్పు కనిపించింది. అందరితో కలసే సినిమాలకి దానికి వెళ్ళానుగాని, నే నొక్కర్తినీ ఆయనతో వెళ్ళలేదే? అంతమాత్రాన కట్టుకున్న మొగుడిని వదిలి ఆయన్ని ప్రేమించేస్తాననుకున్నారా? మోహించేస్తా ననుకున్నారా?... ఛీ...ఛీ...అసలు యింత హీనమైన ఆలోచన మీకెలా వచ్చింది?' ఆవేశంతో దులపసాగింది సుజాత.

'ఏమో, ప్రేమించావో, మోహించావో నా కెలాతెలుస్తుంది!' నిబ్బరంగా చూస్తు నిర్లక్ష్యంగా అన్నాడు.

'అవును...యింతోటి నవ మన్మథుడు నాకు లేడని మోహించేస్తాను...'

'ఆ...యిదేమాట మా చెల్లెలి దగ్గర అను, నీ మొగుడు ఏపాటి నవమన్మథుడో తెలుస్తుంది!'...

'ఆ...యింతోటి మొగుడు,...యీమాట మొగుడు నాకు లేడనా?...అవిడ మొగుడి కోసం ఏడవడం నాకేం ఖర్మ!'...అయినా మీ కిలాంటి అనుమానం అసలు ఎలా వచ్చింది? ఎందుకు వచ్చింది?...నా మాత్రం నామీద నమ్మకం లేకపోయిందా? కట్టుకున్న భార్యని, రెండేళ్ళు కాపురం చేశారు,...నామనసు మీకు తెలీదా?...పిల్లడి తల్లిని. నాని వరుసలుకూడా మరచిపోయారా? ఆయన నాకు అన్నవరస అని తెలుసా? నన్నుగురించి యింత హీనంగా ఎలా ఆలోచించారు? నన్ను యిలా యింత అవమానం చేయడానికి మీ మనసెలా వచ్చింది...ఎందు కింతలా మారిపోయారు ఒకనెలలో... సుజాత గొంతు రుద్ధమవసాగింది...కన్నీళ్ళు జారాయి చెంపల వెంబడి.

ఏడుస్తున్న సుజాత వంక ఒక్క క్షణం చూసి...దృఢంగా ఒక్కొక్కమాట వత్తి పలికాడు సుధాకర్. 'మీ వదినకీ... పెళ్ళయి పదేళ్ళయింది!...ముగ్గురు పిల్లలతల్లి!... నాకు చెల్లెలు వరస!...అన్నమాట...మరచిపోయినట్టున్నావు పాపం!'

తెల తెల బోయి చూస్తున్న సుజాతని ఆత్మవిమర్శచేసుకోడానికి అక్కడే వదిలి, చిన్నగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు సుధాకర్ బయటికి. ●